సాక్షి మంచిర్యాల

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024

హైకోర్టు ఏజీపీగా చెన్నూర్ వాసి



చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పుప్పాల హనుమాన్ వీధికి చెందిన సైదం లక్ష్మీనారాయణ హైకోర్టు అదనపు ప్రభుత్వ ప్రాసిక్యూటర్(ఏజీపీ)గా నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

ముగిసిన టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు మంగళవారం ముగిశాయి. మంచిర్యాల జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 384 మందికి 283, మధ్యాహ్నం 343 మందికి 244 మంది పరీక్షలకు హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /21.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యుత్ సరఫరాలో కోతలు ఉండవు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ సరఫరాలో కోతలు ఉండవని జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్ఈ) ఈ.శేషారావు రాథోడ్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ సరఫరాలో కోతలు విధించడం లేదని పేర్కొన్నారు. లైన్ బ్రేక్‌డౌన్, విద్యుత్ పరికరాలు అమర్చడం, మరమ్మతులు చేపట్టినప్పుడు మాత్రమే సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అనవసరంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం నంబరు 7901628369 ఫోన్ చేయాలని సూచించారు. 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యత ఎంతోముఖ్యం



2కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆర్థికాభివృద్ధి సాధనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యమని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆర్థిక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు 2కే రన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఆదాయంలో కొంత పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే వారిపై జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మార్చి 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు, ఎక్సైజ్, బ్యాంకు, ట్రాఫిక్, ఆర్టీవో అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కోర్టు ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, పోలీసులు కక్షిదారుల రాజీ కుదిర్చేందుకు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌కుమార్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిరోష, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల మూసి వేయొద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని వివేకానంద పాలిటెక్నిక్ కళాశాల మూసి వేయొద్దని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ ఆర్థిక సమస్యల వల్ల కళాశాల మూసివేస్తామని అంటున్నారని, మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు 150 మంది చదువు మధ్యలో ఆగిపోయి రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల కాలేదని యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తోందని తెలిపారు. కళాశాల మూసి వేస్తే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సింగరేణి, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహజ్యోతికి సిద్ధం

- మార్చి నెల 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్
- జిల్లాలో అర్హుల వివరాల సేకరణ పూర్తి
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో జాబితా



జిల్లా వివరాలు

జిల్లాలో మొత్తం కనెక్షన్లు	3,46,473
గృహ విద్యుత్ కనెక్షన్లు	2,59,462
200 యూనిట్లలోపు వినియోగిస్తున్న మీటర్లు	2,25,856
గృహజ్యోతి దరఖాస్తులు నంబర్ అందించింది	1,60,086
తెల్లరేషన్‌కార్డు నంబర్లు అందించింది	1,05,883
ఆధార్‌కార్డు నంబర్లు అందించింది	1,39,965
మొబైల్ నంబర్లు అందించింది	1,54,884

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. ఈ పథకానికి అర్హులైన వారి జాబితాను సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చింది. గత పదిహేను రోజులుగా ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. గృహ యజమానులు అందజేసిన ప్రజాపాలన దరఖాస్తు నంబరు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబరు వివరాలను సేకరించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు. జిల్లాలో నాలుగు సబ్ డివిజన్‌లు ఉండగా మొత్తం 200యూనిట్లలోపు వినియోగించుకున్న కనెక్షన్లు బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో 5,0588, చెన్నూర్ సబ్‌డివిజన్‌లో 31,957, లక్సెట్టిపేట సబ్‌డివిజన్‌లో 42,021, మంచిర్యాల సబ్‌డివిజన్‌లో 1,75,268 ఉన్నాయి. మొత్తంగా 2,25,856 మీటర్లు ఉన్నాయి. ఇందులో 1,60,086 కనెక్షన్‌దారులు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. 1,05,883 మంది తెల్లరేషన్‌కార్డు, 1,39,965 మంది ఆధార్‌కార్డు, 1,54,884 మంది మొబైల్ నంబర్లు అందజేశారు. ఫిబ్రవరి 27 నుంచి వినియోగించే బిల్లు మార్చిలో రానుంది. దీనికి అనుగుణంగా 200 యూనిట్లలోపు వినియోగిస్తున్న వినియోగదారులకు ఉచిత గృహజ్యోతి బిల్లు అందజేయనున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లు సైతం ఇందులో పొందపర్చనున్నారు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు సూచిస్తున్నారు.

కిరాయిదారులు..

జిల్లా కేంద్రంలో అపార్టుమెంట్లతోపాటు ఒకే ఇంట్లో 4 నుంచి 8 మంది కిరాయి ఇళ్లలో ఉంటున్న వారు సైతం గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అద్దెకు ఉన్నవారు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌ను కరెంట్ కనెక్షన్‌కు అనుసంధానం(మ్యాపింగ్) చేయాల్సిందిగా కోరుతుండగా ఇందుకు ఇంటి యాజమానులు ససేమిరా అంటున్నారు. భవిష్యత్‌లో వివాదాలకు దారి తీస్తుందని, న్యాయపరమైన చిక్కులు వస్తాయనే భావనతో ఇళ్ల యాజమానులు ఇందుకు అంగీకరించడం లేదు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వినియోగిస్తున్న వారు వేలల్లో ఉన్నారు. ఇంటి యజమానులు వివరాలు అందించేందుకు నిరాకరిస్తుండడంతో వారంతా ఈ పథకానికి నోచుకోలేక పోతున్నారు. ఇంటి యజమానులు, విద్యుత్ మీటర్ ఓనర్ వివరాలు అందిస్తేనే గృహజ్యోతి పథకానికి అర్హులుగా గుర్తిస్తామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సింగరేణి మీటర్లదారులు కూడా దరఖాస్తు

పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే..

గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లిస్తేనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి అర్హులు అవుతారని సూచిస్తున్నారు. నెలల తరబడి పెండింగ్‌లో బిల్లులు ఉంటే వాయిదా రూపంలో అయినా చెల్లించే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. దీంతో జిల్లాలో పెండింగ్ బిల్లులపై చర్చ జరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు చెల్లిస్తేనే ఉచిత విద్యుత్‌కు అర్హులు అని వదంతులు రావడంతో పెండింగ్ బిల్లులు కట్టేందుకు మొగ్గు చూపుతున్నారు.

బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్ పరిధిలో నివాసం ఉంటున్న సింగరేణి విద్యుత్ వినియోగిస్తున్న కొంతమంది గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. తమ మీటర్లు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు, రేషన్‌కార్డు నంబర్లు కూడా సేకరించాలని విద్యుత్ సిబ్బందిని కోరుతున్నారు. సింగరేణి విద్యుత్ వినియోగిస్తున్న వారిని గృహజ్యోతి పథకంలో తాము గుర్తించలేమని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వివరాలు సేకరించాం..

గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న, గృహ కనెక్షన్లు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వారి నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్, దరఖాస్తు నంబర్ వివరాలను సిబ్బంది సేకరించారు. ఇంకా ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ సీఎండీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. వినియోగదారులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సూచిస్తున్నాం.

– శేషారావు రాథోడ్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



మంచిర్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నంబర్లు పరిశీలిస్తున్న డీఐఈవో శైలజ

- జిల్లాలో 15,529 మంది విద్యార్థులు
- 25 పరీక్ష కేంద్రాలు
- గంట ముందు నుంచే అనుమతి

పరీక్ష కేంద్రాలు.. సిబ్బంది

పరీక్ష కేంద్రాలు:	25
విద్యార్థుల సంఖ్య:	15529
చీఫ్ సూపరింటెండెంట్లు :	25
డిపార్ట్‌మెంట్ అధికారులు:	25
ఇన్విజిలేటర్లు:	520
ఫ్లయింగ్‌స్క్వాడ్ :	2
సిట్టింగ్‌స్క్వాడ్‌లు :	4
కస్టోడియన్లు :	10

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి దశలో కీలకమైన ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19వరకు నిర్వహించే పరీక్షల కోసం 25 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,529మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరం 8,394 మంది, సెకండియర్ 7,135 మంది ఉన్నారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. విద్యార్థులు ముందుగానే తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. గత పరీక్షల సమయంలో చిరునామా తెలుసుకోవడంలో ఇబ్బంది పడిన నేపథ్యంలో అరగంట ముందుగా వెళ్తే బాగుంటుంది. ప్రశ్నపత్రాలు తెరిచే ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉద్యోగులకు పరీక్ష విధుల కేటాయింపులు పూర్తి చేశారు. అవసరం మేరకు ఉపాధ్యాయులకు పరీక్ష విధులు కేటాయించనున్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

విద్యార్థుల హాల్‌టికెట్ల జారీలో ప్రైవేటు కళాశాలలు ఇబ్బందులకు గురిచేసే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వెబ్‌సైట్ నుంచి కూడా నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే వెలుసుబాటు కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టికెట్లపై ఆందోళన చెందకుండా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కళాశాల ప్రిన్సిపాల్ సంతకం, ముద్ర లేకున్నా పరీక్షలకు అనుమతించాలని సీఎస్, డీవోలకు ఆదేశాలు జారీ చేశారు.

మాస్ కాపీయింగ్ కట్టడికి చర్యలు

మాస్ కాపీయింగ్ నిరోధానికి హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలతో నిరంతరం పర్యవేక్షించనున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. క్రిమినల్ కేసులు నమోదైతే విద్యార్థులు ఉద్యోగానికి అనర్హులు అవుతారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్, 100 మీటర్ల మేర జిరాక్స్ సెంటర్లు మూసివేత అమలు చేయనున్నారు.

పాస్ ఉన్న విద్యార్థులకే..

ఇదివరకు బస్‌పాస్‌లు పొందిన విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం కల్పించారు. కళాశాలల(పరిమిత రూట్ వరకు) వరకు వెళ్లేందుకు బస్‌పాస్ పొందిన విద్యార్థులు పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేసినా ఆ రూట్లలో వెళేలా వెసులుబాటు కల్పించారు. హాల్‌టికెట్ చూపించాల్సి ఉంటుంది. మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో బాలికలకు ఉచితం వర్తింపజేస్తున్నారు. ఏదైనా గుర్తింపు కార్డు మాత్రం వెంట తెచ్చుకోవడం మరిచిపోవద్దు.

భయం వీడి పరీక్షలు రాయండి..

ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. ఏదైనా సమస్యలు, సందేహాలు ఉంటే 6281957047 సెల్‌ఫోన్ నంబరు ద్వారా సంప్రదించవచ్చు. విద్యార్థులు భయం వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

– డీఐఈవో శైలజ

సంత్‌శ్రీ సేవాలాల్ మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, వేదికపై అమర్‌సింగ్ తిలావత్, నాయకులు

- కలెక్టర్ బి.సంతోష్
- ఘనంగా జయంతి ఉత్సవం

పాతమంచిర్యాల: సంత్‌శ్రీ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని, ఆయన ప్రబోధించిన మార్గాలు అనుసరిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో మంగళవారం సంత్‌శ్రీ సేవాలాల్ 285వ జయంతి ఘనంగా నిర్వహించారు. మంచిర్యాలలో బంజారా కులస్తులు శోభాయాత్ర నిర్వహించి సేవాలాల్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ బంజారాలు భక్తిమార్గంలో పయనించడానికి మహాసభలు నిర్వహించి అహింసా, సమాజ సేవ, గోవుల పెంపకం, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారని తెలిపారు. సేవాలాల్ మందిరం నిర్మించాలని బంజారా సేవా సంఘం నాయకులు కలెక్టర్‌ను కోరగా.. సానుకూలంగా స్పందించారు. జన్నారం మండం మొర్రిగూడ గ్రామానికి చెందిన జగదాంబదేవి పూజారీ జమిలీబాయిని కలెక్టర్ తదితరులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, బంజారా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సభావత్ శంకర్, వైద్యులు గణేష్ రాథోడ్, బీఎస్ పటేల్, ప్రతిమ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- నిందితులకు శిక్ష పడేందుకు చర్యలు
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: పోలీసు అధికారులు నేరపరిశోధనలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ ప్రాంగణంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ల వారీగా వివరాలు, ఏ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి, నిత్య ఏ విధమైన ఫిర్యాదులు అధికంగా వస్తుంటాయి, పెండింగ్ కేసులు, పరిశోధనలో ఉన్న, పరిశోధన పూర్తయిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. అట్రాసిటీ కేసులు, పోక్సో, ఎన్‌డీపీఎస్, హెచ్‌ఆర్‌సీ, మహిళా కమిషన్‌కు సంబంధించిన అప్పీల్ పిటీషన్ పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిందితులకు చట్టపరిధిలో కఠినమైన శిక్షన పడేలా చూడాలని అన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీలు సుధీర్‌రాంనాథ్ కేకన్, చేతన, ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వాహనాల భద్రతే మన భద్రత

మంచిర్యాలక్రైం: పోలీసు వాహనాలు విధి నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయని, వాటి భద్రతే మన భద్రత అని సీపీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కమిషనరేట్‌లో పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణపై తెలుసుకున్నారు. వాహనాల పరిస్థితిపై ప్రతీ నెల నివేదిక అందజేయాలన్నారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ దామోదర్, ఎంటీఓలు మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశీలనే కీలకం

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం
- 2020లోనే స్వీకరణ
- నాలుగేళ్లుగా పెండింగ్
- సిబ్బంది కొరతతో ఇబ్బందులు



లేఔట్ అనుమతి లేకుండానే పాతమంచిర్యాలలో వెంచర్ చేసి అమ్మకాలు జరిపిన భూమి

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	పరిష్కరించినవి
మంచిర్యాల	22,954	3,674
బెల్లంపల్లి	415	41
క్యాతన్‌పల్లి	7,111	1,314
లక్సెట్టిపేట	2,163	311
నస్పూరు	4,921	4,024
చెన్నూరు	1,321	1,302
మొత్తం	38,885	10,666

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కదలిక మొదలైంది. మున్సిపాల్టీల్లోని అనధికార లేఔట్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఒక్కో దరఖాస్తుకు రూ.1000 చొప్పున ఫీజు వసూలు చేసింది. వీటి పరిశీలన కోర్టు ఆదేశాలతో నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ అధికారులు పక్కన పెట్టేశారు. గత నాలుగేళ్లుగా ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తులకు మోక్షం లభించలేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నీ క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో మరోసారి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

ఎల్ఆర్ఎస్ కోసం అప్పట్లో వేలాదిగా దరఖాస్తులు రావడం, క్షేత్రస్థాయిలోకి వెళ్లి వాటిని పరిశీలించేందుకు అవసరమైన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మున్సిపాల్టీల్లో లేకపోవడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈలోపు పలు కోర్టు వివాదాల నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు బ్రేక్ పడింది. గత ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేపట్టాలని నిర్ణయించింది. కొన్ని దరఖాస్తులను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి.. ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ భూములు, ఇతరత్రా సమస్యాత్మక భూముల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా వేలాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఏడు మున్సిపాల్టీలు ఉండగా.. మందమర్రి మున్సిపాల్టీలో 1/70 ఏజెన్సీ చట్టం అమలులో ఉండడంతో దరఖాస్తులు స్వీకరించలేదు. మిగతా ఆరు చోట్ల 38,885 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా ఇప్పటికే 10,666 పరిశీలించారు. ఇంకా దాదా 28వేల దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పూర్తి స్థాయిలో పరిశీలనకు అవసరమైన సిబ్బంది టౌన్‌ప్లానింగ్‌లో లేరు. ఏడు మున్సిపాల్టీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్కువగా ఉండడంతో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు మున్సిపాల్టీల బాధ్యతలు అప్పగించారు. అత్యధికంగా దరఖాస్తులు వచ్చిన మంచిర్యాల మున్సిపాలిటీలో ఇద్దరు టీపీఎస్‌లు ఉండగా, ఒకరికి బెల్లంపల్లి, మరొకరికి నస్పూరుకు వారంలో సగం రోజులు అదనపు బాధ్యతలు అప్పగించారు. మార్చి 31లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇతరత్రా పనులు పక్కన పెట్టి దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తే కొంతవరకు పూర్తయ్యే అవకాశం ఉంది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిందే..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదే. అనుమతి ఇవ్వాలంటే ఎల్1, ఎల్2, ఎల్ 3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తుకు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు వంటివి ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా అన్నది స్పష్టంగా తెలియజేయాలి. పరిశీలించిన వాటిని ఎల్2 అంటే టీపీఎస్/టీపీవోలు సరిచూసుకుని ఓకే చేస్తేనే ఎల్3 అంటే కమిషనర్‌కు వెళ్తుంది. ఎల్1, ఎల్2లో ఆమోదం పొందిన వాటికి ఎల్3లో మున్సిపల్ కమిషనర్ ఆమోదం తెలపాలి. నిబంధనలకు లోబడి ప్లాటు ఉంటే కొలత, రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ విలువ వంటి వాటిని పరిశీలిస్తారు. వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, కుంటలకు సంబంధించిన భూముల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వందల సంఖ్యలోనే వచ్చినట్లుగా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రాథమిక దర్యాప్తులోనే గుర్తిస్తుండడం గమనార్హం.

మహాలక్ష్మి లబ్ధిదారులు 2.13లక్షలు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా గ్యాస్ సిలిండర్లు రూ.500కే ఇచ్చే మహాలక్ష్మి పథకం అమలుకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రజాపాలనలో జిల్లావ్యాప్తంగా 2,13,037మంది దరఖాస్తు చేసుకోగా, తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి పథకం వర్తించనుంది. గత మూడేళ్లలో కుటుంబం వినియోగించిన సిలిండర్ల సగటు వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇకపై ఆయా లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకు పొందేందుకు అవకాశం ఏర్పడింది. ప్రజాపాలనలో కొందరు దరఖాస్తు చేసుకోలేకపోవడంతో పథకానికి దూరమయ్యారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల కంటే తెల్ల రేషన్‌కార్డుల సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లావ్యాప్తంగా 2,19,190 మంది తెల్ల రేషన్‌కార్డుదారులు ఉండగా, గ్యాస్ కనెక్షన్లు 2,86,130 ఉన్నాయి. కానీ ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులు 2,13,037 మాత్రమే. వీరందరికీ పథకం వర్తించనుండగా, దరఖాస్తు చేసుకోని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తే లబ్ధి చేకూరనుంది.

క్లుప్తంగా

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

లక్షెట్టిపేట: మండలంలోని హన్మంత్‌పల్లి గ్రామానికి చెందిన తోటపల్లి నరేశ్ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్‌కు పదేళ్ల క్రితం అలేఖ్యతో వివాహమైంది. వీరికి సంతానం కలగలేదు. కాగా, ఇదే గ్రామానికి చెందిన శాంతయ్య తనతో గతంలో అలేఖ్య దిగిన ఫొటోలున్నాయంటూ ప్రచారం చేశాడు. వాటిని అందరికీ చూపిస్తానని ప్రచారం చేయగా తీవ్ర మనస్తాపం చెందిన నరేశ్ ఈ నెల 26న ఇంట్లోంచి బహిర్భూమికని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నరేశ్ కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికే క్రమంలో గ్రామశివారులోని వ్యవసాయ బావిలో అతడి మృతదేహం లభించింది. శాంతయ్య వేధింపులు భరించలేకే నరేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి పోషం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శాంతయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన మరో బస్సు



బస్సును ఢీకొన్న మరోబస్సు

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని బూర్గుడ వద్ద ప్రయాణికులను దించేందుకు ఆగింది. ఈక్రమంలో వెనుకనుంచి మరో బస్సు వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొంది. ముందు ఉన్న బస్సులో 30 మంది, వెనుక ఉన్న బస్సులో 50 మంది ప్రయాణికులున్నారు. ఇందులో లక్ష్మి, వికాస్, లస్మయ్య, రామకు స్వల్ప, అనసూర్యకు తీవ్రగాయాలు కాగా 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనసూర్యకు ముక్కుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. రెండు బస్సులు ఆసిఫాబాద్ డిపో నుంచి మంచిర్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా బూర్గుడ గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది.

అధిక ధరలకు విక్రయించొద్దు



జరిమానా వసూలు చేస్తున్న విశ్వేశ్వర్

నస్పూర్: దుకాణాదారులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కే విశ్వేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ పరిధిలోని సుందరయ్యకాలనీ వారసంతలో తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాదారుల కాంటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంటాలను నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సీసీసీలోని ఓ బేకరీలో కూల్‌డ్రింక్‌ను అధిక ధరలకు విక్రయిస్తుండగా నిర్వాహకుల నుంచి రూ.2వేల జరిమానా వసూలు చేశారు.

భళా.. బాలశాస్త్రవేత్తలు!

- విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు
- అబ్బురపరిచేలా ఆవిష్కరణలు
- ఇన్‌స్పైర్ మనాక్‌లో ప్రదర్శనలు
- రాష్ట్రస్థాయికి పలువురి ఎంపిక
- నేడు సైన్స్ దినోత్సవం



మంచిర్యాల జిల్లా సైన్స్ సెంటర్ భవనం

మంచిర్యాలఅర్బన్: టెక్నాలజీపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు. వినూత్నంగా ఆలోచించి అద్భుత ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల ప్రదర్శనలో సరికొత్త ప్రాజెక్టులను ప్రదర్శించారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే పలు సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఇటీవల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 10 అత్యుత్తమ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికయ్యాయి. జనవరి 23, 24తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన విజ్ఞాన మేళాలో బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల (భీమారం)కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సందీప్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సాంకేతిక విద్యామండలి పర్యావరణ పరిరక్షణ పరిశోధన సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. నేడు సైన్స్ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కథనం..

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

- జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల (మంచిర్యాల)కు చెందిన షేక్ సాధిక్ హోమ్ మేడ్ డ్రైన్ క్లీనర్ ప్రాజెక్ట్‌తో ఎవరి అవసరం లేకుండా కాలువలు శుభ్రం చేసే పరికరం తయారు చేశాడు.
- చిన్నమున్ని పబ్లిక్ స్కూల్ విద్యార్థి కొమ్మెర శ్రీవాత్సవ అండర్ ఆర్మ్ క్రచెస్ విత్ సీట్ టార్చ్ లైట్ అండ్ ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌తో దివ్యాంగులు సులువుగా కూర్చోవటం, రాత్రి వేళ టార్చిలైట్‌లా ఉపయోగించటం, అత్యవసర మందులు పెట్టేలా ఉంచుకునే పరికరం తయారు చేశాడు.
- కిష్టాపూర్ జెడ్పీఎస్‌ఎస్ విద్యార్థి తేజావత్ విజయ్ సైకిల్‌పై స్టూడెంట్ ఫ్రెండ్లీ క్యారేజ్‌తో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వస్తువులు పెట్టుకునే పరికరం రూపొందించాడు.
- అచ్చలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పొట్లపల్లి సురేశ్ ఈస్లీ రిమూవ్ అండ్ ఇన్‌స్టాల్ బల్బు పేరిట సీలింగ్‌పై ఉన్న విద్యుత్ బల్బులను నేలపై నిల్చొని అమర్చటం, తొలగించే పరికరాన్ని రూపొందించాడు.
- అచ్చలాపూర్ జెడ్పీఎస్‌ఎస్, బీసీ గురుకులానికి చెందిన బామండ్ల పల్లి హర్షిత, అక్కల ప్రశాంత్ ఫెర్టిలైజర్ డ్రాపిగ్ గన్, డంపింగ్ మెషిన్ ఫర్ స్ప్రెయింగ్ ఫెర్టిలైజర్ పరికరంతో చేతితో తాకకుండా తక్కువ సమయంలో పంటలకు ఎరువులు వేసే పరికరాన్ని రూపొందించారు.
- దొడపల్లి జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన సామల విఘ్నేశ్వర్ ఇండీసెంట్ రీస్ట్రైంట్ ప్రాజెక్టును తయారు చేశాడు.
- వీగాం జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన సుష్మిత పోర్టబుల్ వాష్‌బేషన్ పరికరంతో అబ్బురపరిచింది.
- మంచిర్యాల కేజీబీవీకి చెందిన సైదం రవళి ఫ్రీఎనర్జీ వాటర్ పంప్‌తో విద్యుత్ అవసరం లేకుండా నీటిని సరఫరా చేసే పరికరంతో ఔరా అనిపించింది.
- అచ్చలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన మామిడి స్ఫూర్తి డివైస్ ఫర్ ప్లాంటింగ్ సీడ్స్ అండర్ మేకింగ్ హోల్స్ (వ్యవసాయ కూలీలు అవసరం లేకుండా తక్కువ శ్రమతో భూమిలో రంధ్రాలు చేయటం.. ఒకే సమయంలో విత్తనాలు వేయడం) పరికరంతో మెప్పించింది.

పరిసరాల పరిశుభ్రతకు..



ప్రయాణం చేసేటప్పుడు వాంతులు, విరోచనాలతో బాధపడేవారి కోసం బస్సులో టాయిలెట్ గది, వాష్‌బేషన్, నీటి ట్యాంక్ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. వ్యర్థాలు నిండిన తర్వాత సమీపంలోని బస్టాండ్‌లో శుభ్రం చేసి మళ్లీ నీటితో నింపి ప్రయాణికులకు ఉపయోగపడేలా చేయవచ్చు. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతో పాటు సమయం వృథాను అరికట్టవచ్చు. అందుకే పోర్టబుల్ వాష్‌బేషన్ రూపొందించాను.

– సుష్మిత, వీగాం భీమిని జెడ్పీఎస్‌ఎస్

వ్యాధుల నుంచి కాపాడుకునేలా..



ఇంటి ముందు డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోవటం చూశాను. వ్యర్థ నీరు రోడ్లపై ప్రవహించటం, దోమలు వృద్ధి చెందటం.. జనాలు వ్యాధుల బారిన పడడం గమనించాను. వానాకాలంలో మున్సిపల్ కార్మికులు కూడా డ్రెయినేజీ శుభ్రం చేసేందుకు వీలుండదు. ఇలాంటి సమస్యను అధిగమించేందుకు హోమ్ మేడ్ డ్రైన్ క్లీనర్ పరికరాన్ని తయారు చేశాను. దీంతో ఎవరి అవసరం లేకుండా కాలువలు శుభ్రపర్చుకోవచ్చు.

–షేక్ సాధిక్, మంచిర్యాల జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర)

స్టూడెంట్ ఫ్రెండ్లీ సైకిల్ క్యారింగ్



తాను తయారు చేసిన సైకిల్ క్యారింగ్ పరికరంతో విజయ్‌కుమార్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తేజావత్ విజయ్‌కుమార్ నిత్యం సైకిల్‌పై కామన్‌పల్లి నుంచి పాఠశాలకు వస్తుంటాడు. వానాకాలంలో బ్యాగ్ వెనుక స్టాండ్‌కు పెట్టి సైకిల్‌పై వస్తుండగా అది కింద పడి బురద అంటింది. ఇలా పలుసార్లు జరగడంతో అతడికి ఓ ఆలోచన తట్టింది. ఇనుప పట్టీలు, స్క్రూలతో ఓ పరికరాన్ని రూపొందించి సైకిల్‌కు అమర్చాడు. దీంతో అతడి సమస్యకు పరిష్కారం లభించింది. దీనిని 15 రోజుల క్రితం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో విజయ్‌కుమార్ ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

టాలెంట్ టెస్ట్‌లో అశ్వక్..

జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అశ్వక్ రాష్ట్రస్థాయి సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ డేను పురస్కరించుకుని నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి పొందాడు. జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నాడు. సైన్స్‌పై అవగాహన ఉండటంతో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తాను గుర్తింపు తెచ్చుకున్నట్లు అశ్వక్ తెలిపాడు.

విజ్ఞాన గనిగా సైన్స్ సెంటర్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు, ఆవిష్కరణలకు జిల్లా సైన్స్‌సెంటర్ దిక్సూచిగా నిలుస్తోంది. జిల్లా స్థాయినుంచి జాతీయ స్థాయి వరకు ఎంతోమంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు ఇది వేదికైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడలోని సైన్స్ సెంటర్ ప్రేరణతో 2018 ఆగస్టు 9న అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ జిల్లా సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ నిధులు రూ.16,93,300 వెచ్చించి అన్ని రకాల పరిశోధనలకు సంబంధించిన పరికరాలు ఇందులో అందుబాటులో ఉంచారు. జిజ్ఞాస మొబైల్ వ్యాన్ ద్వారా ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా 127 పాఠశాలలకు చెందిన 8వేల మంది విద్యార్థులు, 500 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరింది.

ఎగ్జిబిషన్ బుక్‌లో ప్రచురితం

గనుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జనవరి 22, 23తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన రెండో మైనింగ్ మినిస్టర్ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ టేబుల్ బుక్‌లో జిల్లా సైన్స్ సెంటర్‌కు సంబంధించిన పలు విషయాలు ప్రచురించబడ్డాయి. కాఫీ టేబుల్స్‌లో భారతదేశం అంతటా అనేక ముఖ్యమైన డీఎంఎఫ్ ప్రాజెక్టుల విజయగాథ లున్నాయి. తెలంగాణ నుంచి జిల్లా సైన్స్ సెంటర్‌ను ఎంపిక చేశారు. మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ భారత ప్రభుత్వం ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, కూ, థ్రెడ్స్ లాంటి అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో జిల్లా సైన్స్ సెంటర్ విజయగాథను పోస్ట్ చేసింది. దీనిపై జిల్లా సైన్స్ అధికారి మధుబాబు హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ సెంటర్ అభివృద్ధి, విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా విద్యాధికారి యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రయోగాలను వీక్షిస్తున్న డీఈవో యాదయ్య

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక

విత్తనాలు వేసే పరికరం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని మైదం స్ఫూర్తి విత్తనాలు వేసే పరికరాన్ని రూపొందించింది. దీని ద్వారా నేలకు రంధ్రం చేసి విత్తనాలు వేయొచ్చు. తక్కువ సమయంలో సులభంగా విత్తనాలు విత్తుకోవచ్చు. పని సత్వరంగా పూర్తి కావడంతో పాటు కూలీల సమస్య ఉండదు.



పరికరంతో మైదం స్ఫూర్తి

సీలింగ్ బల్బు వేసే పరికరం

ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పొట్లపల్లి నరేశ్ సీలింగ్ బల్బు వేసే పరికరాన్ని తయారు చేశాడు. దీని ద్వారా నేలపై నిల్చుని సీలింగ్‌కు ఉన్న బల్బులు తీయవచ్చు. కొత్త బల్బులు బిగించవచ్చు.



పరికరంతో పొట్లపల్లి నరేశ్

ఎరువు డ్రాపింగ్ గన్

పదో తరగతి విద్యార్థిని బామండ్లపల్లి హర్షిత పత్తి, మిర్చి, టమాట మొక్కలకు సులభంగా ఎరువు వేసే పరికరాన్ని రూపొందించింది. దీని ద్వారా చేతితో ఎరువులు ముట్టుకోకుండానే తక్కువ సమయంలో ఎక్కువ మొక్కలకు తగినంత పరిమాణంలో సులభంగా ఎరువులు వేయవచ్చు.



పరికరంతో బామండ్లపల్లి హాస్మిత

రాష్ట్రస్థాయి ఉపన్యాసపోటీలకు..

ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని వీ హాస్నిత జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉపన్యాసపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 28వ తేదీన వరంగల్ జిల్లా సైన్స్‌సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో హాస్నిత బహుమతి అందుకోనుంది.



బహుమతి అందుకుంటున్న హాస్నిత

యువతి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పెంచికల్‌పేట్: మండలంలోని గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల, కొయపల్లి గ్రామానికి చెందిన కుమురం రవికుమార్ ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. గత శుక్రవారం రవికుమార్ గుండెపల్లి గ్రామానికి రాగా నిర్మల చెట్టుకింద ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించింది. ఎవరితో మాట్లాడుతున్నావని అనుమానంతో గొడవకు దిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆగ్రహంతో కర్రతో నిర్మల తల, మెడపై రవికుమార్ దాడి చేయగా ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను పక్కకు తీసుకునివెళ్తున్న క్రమంలో కాళ్లు, చేతులు కదిపింది. దీంతో రవికుమార్ మరోసారి ఆమెపై కర్రతో దాడి చేసి సమీప వ్యవసాయ బావిలో పడేశాడు. ఎంతసేపటికీ నిర్మల ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వ్యవసాయ బావి సమీపంలో ఆమె చెప్పులు, రక్తపు మరకలు కనపడగా తండ్రి నారాయణ పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు బావిలో వెతకగా యువతి శవం లభ్యమైంది.



పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం ఎల్కపల్లి సమీపంలో రవికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. రవికుమార్ తానే హత్య చేసినట్లు ఒప్పుకోగా, అతడి నుంచి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై కొమురయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇద్దరికి గ్రామస్తుల దేహశుద్ధి

- పిల్లలను ఎత్తుకెళ్లేవారని అనుమానం

భీమారం: మండలంలోని కాజిపల్లి, బూర్గుపల్లి గ్రామాల పరిధిలో పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తులుగా భావించి ఇద్దరు అనుమానితులకు ప్రజలు సోమవారం రాత్రి దేహశుద్ధి చేశారు. మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కొద్ది గ్రామాల్లో పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాలు సంచరిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బూర్గుపల్లిలోని గెర్రెగూడెం సమీపంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగడం చూసిన స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందులో ఇద్దరు తప్పించుకుపోగా ఒకరు పట్టుబడ్డాడు. అతడిని చితక బాది అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మంగళవారం ఉదయం కాజిపల్లి సమీపంలో మరో వ్యక్తి గ్రామస్తులకు తారసపడ్డాడు. అతడి వివరాలు తెలుసుకునేందుకు యత్నించినా చెప్పలేదు. పైగా అతడి వద్ద కత్తి లభించింది. దీంతో ప్రజలు కత్తి స్వాధీనం చేసుకుని అతడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఏఎస్సై భూమన్న సాక్షితో మాట్లాడుతూ.. పట్టుబడ్డ ఇద్దరిని ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం చెప్పలేదని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉంటారని, మతిస్థిమితం లేనివారిగా గుర్తించి వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు.



బూర్గుపల్లిలో పట్టుబడ్డ వ్యక్తి



అనుమానిత వ్యక్తి వద్ద లభించిన కత్తి



కాజిపల్లిలో పట్టుబడ్డ వ్యక్తి

సైన్స్‌తోనే మానవ మనుగడ



మాట్లాడుతున్న వీరబ్రహ్మాకిషన్

లక్సెట్టిపేట: సైన్స్‌తోనే మానవుని జీవితం ముడి పడి ఉందని, సైన్స్‌తో మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ జోనల్ సెక్రటరీ, ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ముందస్తు నేషనల్ సైన్స్ డే సందర్భంగా 'వికసిత్ భారత్ కోసం దేశీయ సాంకేతికలు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్య జీవితంలో సైన్స్ పాత్ర మరువలేమని పేర్కొన్నారు. బయాలజీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ మాత్రమే సైన్స్ కాదని, సృష్టిలో ప్రతీది సైన్స్‌తో ముడిపడి ఉందని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ప్రకృతిలో జరుగుతున్న ప్రతీ విషయం వెనుక సైన్స్ దాగి ఉంటుందని తెలిపారు. సీవీ రామన్ ఎఫెక్ట్ భారతదేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగయ్య, కోఆర్డినేటర్ సవిత, అధ్యాపకుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: సీనియర్స్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఈ.మహేందర్‌రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్ హన్మంతరావు, ట్రెజరర్‌గా తోట రాజయ్య, ఉపాధ్యక్షులుగా బీ కృష్ణ, మోహన్‌లాల్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ ప్రభాకర్ ఎన్నికయ్యారు.

హ్యాండ్‌బాల్ పోటీల న్యాయనిర్ణేత రాజలింగు

మంచిర్యాలటౌన్: జాతీయ స్థాయి ఆల్ ఇండియా పోలీస్ మీట్ హ్యాండ్ బాల్ పోటీలను ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించనుండగా రిఫరీగా తెలంగాణ నుంచి దుర్గం రాజలింగు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. రాజలింగు జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.



రాజలింగు

సీసీరోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ బాపూరావు

జన్నారం: మండలంలోని పొనకల్, బాదంపల్లి, చింతగూడ, ధర్మారం గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఎంపీ సోయం బాపూరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం, మోదీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచులకు నిధులు మంజూరు చేయక అభివృద్ధి కుంటుపడేలా చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 80 రోజులైనా గ్రామాలాభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా ప్రధాని ఫొటో పెట్టకుండా, రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. ఎంపీ బండి సంజయ్ చేస్తున్న యాత్రను అడ్డుకోవడం సరికాదన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు గోలి చందు, జిల్లా నాయకుడు మధుసూదన్‌రావు, బీజేవైఎం అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, నాయకులు మల్లేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విద్యాబోధన



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ (ఎయిడెడ్) హైస్కూల్లో విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన జరుగుతోందని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఏరియాలోని సింగరేణి హైస్కూల్ 49వ వార్షికోత్సవం నిర్వహించగా ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు సవితా మనోహర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలిచారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని మంచి జీపీఏ వచ్చేలా పరీక్షలు రాయాలని సూచించారు. పాఠశాలకు మరికొన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందని హెచ్‌ఎం పురుషోత్తం తన వార్షిక నివేదికలో కోరగా.. తప్పకుండా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీఎం హామీ ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర హుండీ లెక్కింపు

మందమర్రిరూరల్: ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు పాలవాగు సమీపంలోని ఆర్కే–1ఏ గని వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను మంగళవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో లెక్కించారు. రూ.13,61,700 ఆదాయం వచ్చినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ తెలిపారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఆర్కే–1ఏ గని మేనేజర్ జయంత్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, దాగం మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది